క్లుప్తంగా

నేడు శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట



శంకరాపురంలో ముస్తాబైన శ్రీరామ మందిరం

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరంలో మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సీతారామ, లక్ష్మణ సహిత హనుమంతుని విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభం, విమాన కలశ ప్రతిష్ట, కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేడు ముక్కమల్లకు ఎమ్మెల్యే రాక

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో ఎమ్మెల్యే కటసాని రామిరెడ్డి శనివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కర్నూల్, నంద్యాల జిల్లాల ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలా రెడ్డి, కార్యదర్శి సిద్దం రెడ్డిరామ్మోహన్ రెడ్డి తెలిపారు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ కింద రూ.1.04 కోట్లతో ఓహెచ్ ఆర్ ట్యాంక్, సంపు, పంపు హౌస్, రూ.24లక్షలతో హెల్త్ క్లీనిక్ భవనం, రూ.6 లక్షలతో జగనన్న కాలనీ ఆర్చ్, రూ.20 లక్షలతో ఇంటింటికీ కొళాయి, రూ.30 లక్షలతో కాలనీల్లో సీసీరోడ్లు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని చెప్పారు. నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

సమాజ సేవతోనే సంతృప్తి



దాతను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

డోన్ టౌన్: రోటరీ క్లబ్ సభ్యులకు సమాజ సేవతోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని క్లబ్ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భారతి అన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ డే పురస్కరించుకుని క్లబ్ సభ్యుడు గంగిరెడ్డి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 50 స్టీల్ ప్లేట్లను అందజేశారు. భోజనం వడ్డించారు. అనంతరం దాత గంగిరెడ్డిని శాలువ, మెమెంటోతో సత్కరించారు. క్లబ్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రతినిధులు విజయ్‌కుమార్, కిషోర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులను అరికట్టాలి



వినతిపత్రంతో న్యాయవాదులు

డోన్ టౌన్: న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డోన్ బార్ కౌన్సిల్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎంకు ఫ్యాక్స్ ద్వారా వినతి పత్రం పంపారు. రాజస్థాన్, కేరళతో పాటు పలు రాష్ట్రాల్లో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తున్నారని.. అదే తరహాలో ఏపీలో కూడా అమలు చేయాలన్నారు. న్యాయవాదులు పులిదామోధర్, నరసింహులు, రాగుల రాముడు, ఆంజనేయగౌడ్, నారాయణ, శేషశయనరావు ఉన్నారు.

నేడు కాశీవిశాలక్షి, విశ్వేశ్వరస్వామి కల్యాణం

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమాన్‌పురం గ్రామంలో వెలసిన కాశీవిశాలక్షి, విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా వృషభాలకు బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10, 6, 5, 3 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి తనిఖీ

డోన్ టౌన్: జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు డోన్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని డోన్ డివిజన్ పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్న కేశవులు శుక్రవారం తనిఖీ చేశారు. అర్హత లేని వైద్యురాలు రోగులను పరీక్షిస్తున్నట్లు పట్టణానికి చెందిన న్యాయవాది ఈశ్వర్ ఫిర్యాదు మేరకు తనిఖీలు చేసినట్లు ఆయన తెలిపారు. గుర్తించి విషయాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీపై విహరిస్తున్న అమ్మవారు

బనగానపల్లె రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని నందవరం గ్రామంలోని శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారికి శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, అభిషేక పూజలు జరిగాయి. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీపై కొలువుదీర్చి ఊరేగించారు. సహస్ర దీపాలంకరణ, ఊయల సేవా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ రామాజన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రగతి మెరిసే.. పల్లె మురిసే..!

- మారిన చిన్నకొప్పెర్ల రూపురేఖలు
- రూ.1.74 కోట్లతో అభివృద్ధి పనులు
- పట్టణాన్ని తలపిస్తున్న పల్లె
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- మెరుస్తున్న సీసీరోడ్లు
- గ్రావెల్ రోడ్లతో తొలగిన కష్టాలు

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని గాంధీజీ అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. రోడ్లు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పల్లెలు కొత్త శోభను సంతరించుకున్నాయి. కోవెలకుంట్ల మండలం చిన్న కొప్పెర్ల గ్రామంలో ఈ ఐదేళ్ల కాలంలో రూ. 1.74 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులతో రూపురేఖలు మారిపోయాయి.

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోంది. గ్రామ సచివాలయ మొదలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతి మెరుస్తోంది. కోవెలకుంట్ల మండలంలోని వల్లంపాడు, పెద్దకొప్పెర్ల, మజరా గ్రామమైన ఎం. గోవిందిన్నె గ్రామాలు చిన్నకొప్పెర్ల సచివాలయ పరిధిలో ఉన్నాయి. ఇక్కడ రూ. 79.30 లక్షలతో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌కు ఒకే చోట ప్రభుత్వ భవనాలు నిర్మించడంతో ఆ ప్రాంతం ప్రభుత్వ కార్యాలయాల కేంద్రంగా మారింది. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రజలకు కష్టాలు తీరిపోయాయి.

సమస్యకు చెక్

గ్రామానికి 4.5 కి.మీ దూరంలో ఉన్న లింగాల సీపీడబ్ల్యూఎస్ నుంచి తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. గతంలో పైప్‌లైన్ సరిగా లేకపోవడం, లీకేజీలతో నీరు అంతంత మాత్రమే సరఫరా అయ్యేది. దీంతో గ్రామస్తులు తాగునీటి కష్టాలు ఎదుర్కొనేవారు. ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా రూ. 31 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో కొత్తగా పైప్‌లైన్ వేయడంతో పాటు గ్రామంలో కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. నీరు సమృద్ధిగా వస్తుండటంతో నీటి కష్టాలు తీరిపోయాయి. అలాగే తాగునీటి కోసం గ్రామంలో మూడు ప్రాంతాల్లో చేతిబోర్లు ఏర్పాటు చేశారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో అంతర్గత రోడ్లు లేక వర్షాకాలంలో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడేవారు. వర్షపునీరు, మురుగునీరంతా వీధుల్లో నిల్వ ఉండేది. ఆయా కాలనీల్లో రూ. 28.50 లక్షలతో సీసీరోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేశారు. నాడు–నేడు మనబడి కార్యక్రమం ద్వారా రూ.16 లక్షలతో పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్లు, బాత్‌రూం, ప్రహరీగోడ తదితర అభివృద్ధి పనులు చేశారు.





రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం



రూ. 17.50 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్



బీసీ కాలనీలో సీసీరోడ్డు.




చర్చి సమీపంలో సీసీరోడ్డు

అభివృద్ధి పనుల వివరాలు

- రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం
- రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ. 17.50 లక్షలతో హెల్త్ క్లినిక్ భవనం
- రూ. 31 లక్షలతో లింగాల సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నుంచి గ్రామంలోకి పైప్‌లైన్
- చర్చి నుంచి పెద్దగుడి, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో రూ. 28.50 లక్షలతో సీసీరోడ్లు, కల్వర్టు పనులు
- పొలాలకు వెళ్లేందుకు వీలుగా రూ. 5 లక్షలతో గ్రావెల్ రోడ్డు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో సీసీరోడ్డు
- కాశీనాయన గుడి, సచివాలయ ఆవరణ, బీసీ కాలనీల్లో రూ. 5 లక్షలతో పైప్‌లైన్, చేతిబోర్లు ఏర్పాటు
- నాడు– నేడు కార్యక్రమం ద్వారా రూ. 16 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు
- గ్రామ సచివాలయ ఆవరణలో రూ.3 లక్షలతో పబ్లిక్ టాయిలెట్

అన్ని వసతులు కల్పించాం



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో గ్రామంలో అన్ని వసతులు కల్పించాం. చిన్న గ్రామంలో రూ. 1.74 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు, జలజీవన్ మిషన్ ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.
–మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, చిన్నకొప్పెర్ల

సీసీరోడ్ల ఏర్పాటుతో తొలగిన కష్టాలు



గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలకు గతంలో సీసీరోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. చిన్నపాటి వర్షానికే వీధులన్నీ బురదమయంగా మారేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీసీరోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేయడంతో సమస్యలు తొలగిపోయాయి. – రామచంద్రారెడ్డి, చిన్నకొప్పెర్ల

కొత్త శోభను సంతరించుకుంది



గతంలో సర్పంచ్‌గా ఉన్న విజయలక్ష్మి దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో నాలుగు నెలల నుంచి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాను. గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నాను. గ్రామంలో ఒకే చోట ప్రభుత్వ భవనాల ఏర్పాటుతో పట్టణ శోభ సంతరించుకుంది. ప్రజలకు కావాల్సిన వసతులను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తున్నాను.
–పద్మావతమ్మ, సర్పంచ్, చిన్నకొప్పెర్ల

9న లోక్ అదాలత్



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తులు

డోన్ టౌన్: స్థానిక కోర్టు ఆవరణలో మార్చి 9వ తేదీ జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. కోర్టు ఆవరణలో శుక్రవారం లోక్ అదాలత్‌పై న్యాయమూర్తులు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ హనీషా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్‌తో కలిసి పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు తెలియజేసి కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సమయం ఆదాతో పాటు సత్వర న్యాయం దొరుకుతుందని తెలిపారు. అనంతరం కేసుల వివరాలపై ఆరా తీశారు. సమావేశంలో సీఐలు, ఎస్‌ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష.. ప్రజల ఆరోగ్యానికి రక్ష



మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి.



వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు

అవుకు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. అవుకు–1 గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో హెల్త్ క్లీనిక్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్యాన్ని, ఆరోగ్య సురక్షతో ఆయా గ్రామాల్లోనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రతి పేదవాడికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అనంతరం వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, ఈఓ అశ్విన్ కుమార్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఐదో గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాలకు చెందిన డాక్టర్లు సుప్రియ, హరికృష్ణ, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్లు రాబర్ట్‌కెన్నేడి, అశోక్, కంటి వైద్య నిపుణుడు గంగాధర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. సచివాలయ పరిధిలోని ఆయా కాలనీలకు చెందిన 521 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. వీరిలో 66 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 17 మంది గర్భిణులు, 18 మంది పిల్లలు, మిగిలిన వారికి సాధారణ జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తోందని చెప్పారు. వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసి ఆధునిక వైద్య సేవలందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, ఎంపీటీసీ స్నేహ, ఈఓపీఆర్‌డీ రాధిక, ఈఓ గోపినాథ్, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు పాల్గొన్నారు.

మందకృష్ణ పర్యటనను విజయవంతం చేద్దాం

డోన్ టౌన్: కర్నూలులో ఈ నెల 28వ తేదీ జరిగే ఎమ్మార్పీఎస్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్న మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని సమితీ నేత ఈశ్వరయ్యమాదిగ కోరారు. ఆ మేరకు స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. , సర్పంచ్ మద్దిలేటి, ఎమ్మార్పీస్ నాయకులు కేశవయ్య, రామాంజనేయులు, చిన్నరాయుడు పాల్గొన్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా రాస్తారోకో

డోన్ టౌన్: రైతులపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అఖిల భారత కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో శుక్రవారం సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వెళుతున్న రైతులపై భాష్పవాయువు, రబ్బరు బెల్లెట్లు వినియోగించడం దారుణమని తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంక సుబ్బారాయుడు, శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికలను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ

బనగానపల్లె రూరల్: బాలికలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బేటీ బచావో–బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపల్ సాలేహాబేగంతో కలిసి అవగాహన కల్పించారు. బాలికలు, బాలురలతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. బాలికలపై తల్లిదండ్రులు వివక్ష చూపించరాదని, బాలురతో సమానంగా వారికి ప్రోత్సాహం అందించాలన్నారు. విద్యార్థినులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇతరుల నుంచి ఇబ్బందులు ఎదురైతే మొదట తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఏసీడీఓ రోజారాణి, సూపర్‌వైజర్లు శైలజ, చిట్టెమ్మ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సమాజ సేవకులు

- వలంటీర్లకు వందనంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డు గ్రహీతలకు సన్మానం



మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: జాతిపిత మహాత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. డోన్‌లోని సాయి ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవార్డుల కింద సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30వేలు, సేవా మిత్రకు రూ.15 వేల చొప్పున నగదు పురస్కారాన్ని అందజేశారు. వలంటీర్ల సేవలను కొనియాడారు.

వారి సేవలు అభినందనీయం

గత టీడీపీ హయాంలో పింఛన్ కోసం వృద్ధులు గంటల తరబడి కార్యాలయం వద్ద ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను నిలువుదోపిడీ చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. వలంటీర్ల ద్వారా తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతున్నట్లు చెప్పారు.

గురువింద గింజ తన కింది నలుపెరుగదు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు పందికొక్కుల్లా దిగమింగిన ఆ పార్టీ నాయకులు రాష్ట్రంలో ఎవరో ఒక వలంటీర్ తప్పు చేస్తే మొత్తం వలంటీర్ వ్యవస్థపైనే బురద జల్లడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో 2.65లక్షల మంది, డోన్ నియోజకవర్గంలో 1500 మంది నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారిపై ఎల్లో మీడియాతో పాటు టీడీపీ, జనసేన నాయకులు అబండాలు మోపడం ఏమాత్రం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఇది గురువింద గింజ సామెతను గుర్తు చేస్తుందన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకనే..

నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నేతలు అభూతకల్పనలు, అసత్య ఆరోపణలతో విష ప్రచారం చేస్తున్నారని బుగ్గన మండిపడ్డారు. ప్రతి కుటుంబానికి 3 సెంట్ల స్థలం ఇస్తానని ఏడాది నుంచి చెబుతున్న టీడీపీ నేతలు వారి హయాంలో ఒక్క సెంటైనా పేదలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారన్నారు. ఏడాదికి 12 సిలిండర్లు, రైతులకు రుణమాఫీ, మహిళలకు డ్వాక్రా రుణాల మాఫీ అంటూ మభ్యపెట్టిన విషయాన్ని ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన నాయకులకు తగిన గుణపాఠం నేర్పాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, ఎంపీపీలు రేగటి రాజశేఖర్‌రెడ్డి, గోకుల్ లక్ష్మి, బుగ్గన నాగభూషణంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, బోరెడ్డి శ్రీరాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జయరాం, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు.



బేతంచెర్ల: వలంటీర్ మహాలక్ష్మికి సేవావజ్ర అవార్డును అందజేస్తున్న మంత్రి బుగ్గన

వలంటీర్లకు సన్మానం

బేతంచెర్ల: వలంటీర్ సేవలు అభినందనీయమని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బేతంచెర్ల మండలంలోని వలంటీర్లను డోన్‌లో సన్మానించారు. బేతంచెర్ల నగర పంచాయతీ–2 వలంటీర్ మహాలక్ష్మికి సేవా వజ్ర, 1, 4, 5 గ్రామ సచివాలయాలకు చెందిన చిట్టిబాయి, ప్రభాకర్, శాంతిప్రియ సేవారత్న అవార్డులు, మిగతా 217 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు అందజేశారు. అలాగే మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామానికి చెందిన చంద్రనాయుడు సేవావజ్ర, సీతారామాపురం గ్రామానికి చెందిన గౌతమి , కొలుములపల్లె గ్రామానికి చెందిన జయంతిలకు సేవారత్న, 257 మందికి సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ వార్డు సభ్యుడు బువాజీ హుసేన్‌వలి (46) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతిపై మండల కోఆప్షన్ మెంబర్ జలదుర్గం అబ్దుల్ రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో బెల్ట్‌షాప్ ద్వారా మద్యం విక్రయిస్తున్న పెద్ద దస్తగిరిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ రెడ్డి తెలిపారు. గ్రామ శివారులో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. పెద్ద దస్తగిరి నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

3న పల్స్ పోలియో



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లెరూరల్: ఐదేళ్లలోపు చిన్నారులకు మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా టీకాలు వేయించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించాలన్నారు. వారికి మార్చి 3న పోలియో చుక్కలు వేయాలన్నారు. మిగిలిపోయిన చిన్నారులకు మార్చి 4, 5వ తేదీల్లో వేసి వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. డాక్టర్ సోహెల్‌బాబు, ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీఓ సరళగంగ, సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా.. ఆరోగ్యశ్రీ



మహిళలతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా ఆఫీసర్ కామేశ్వరరావు

బనగానపల్లె రూరల్: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేదల ఆరోగ్యానికి భరోసానిస్తోందని జిల్లా మలేరియా ఆఫీసర్ కామేశ్వరరావు అన్నారు. మండలంలోని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెరువుపల్లె గ్రామంలో ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఎస్‌వై) ఆరోగ్యశ్రీకార్డులు పొందిన లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ కార్డు వల్ల కలిగే ఉపయోగాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్డుతో రూ.25లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చని తెలిపారు. ఆయనతో పాటు మెడికల్ ఆఫీసర్ మధుమౌనిక, సబ్ యూనిట్ ఆఫీసర్ రత్నమయ్య, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బరాయుడు, ఎంపీహెచ్‌ఎస్ సరళగంగ తదితరులు ఉన్నారు.

పరామర్శ

బనగానపల్లె: స్థానిక సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల సర్పంచ్ భర్త ఎల్లయ్య గుండెపోటుకు గురికావడంతో నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు నాయకులు సుదర్శన్‌రెడ్డి, అలీఅబ్బాస్, ముర్తుజా హుస్సేన్, పుల్లయ్య ఉన్నారు.